క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి


మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

నర్సాపూర్(జి): మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ వేతనాలు, బిల్లులు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మన సురేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం భోజన యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం కార్మికులకు రూ.10 వేలు గౌరవ వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గృహలక్ష్మి పథకం పేరుతో సిలిండర్ రూ.500కే ఇస్తోందని, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు గ్యాస్ సబ్సిడీపై అందించాలన్నారు. సమావేశంలో యూనియన్ మండల కార్యదర్శి రాజవ్వ, వచలాబాయి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే డయల్ 100కు చేయండి


అవగాహన కల్పిస్తున్న షీ టీం పోలీసులు

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఈద్గామ్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో గురువారం అవగాహన కల్పించారు. 100 డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి వివరించారు. ఆపద సమయంలో సెల్‌నంబర్ 8712659550కి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం పోలీసులు రమాదేవి, రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ


వద్యాల్‌లో పరామర్శిస్తున్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

లక్ష్మణచాంద: మండలంలోని వద్యాల్‌లో సుల్తానా బేగం, పొట్టపెల్లిలో సాయన్న, రాచాపూర్‌లో రాజేందర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు గురువారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా నర్సాపూర్ గ్రామంలో శ్రీకాంత్ కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట నాయకులు ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, పోతారెడ్డి, గంగారాం, రవీందర్ రెడ్డి, వికాస్‌రెడ్డి, రవి ఉన్నారు.

సన్మానం


గంగాధర్‌పటేల్‌ను సన్మానిస్తున్న సభ్యులు

భైంసారూరల్: వానల్‌పాడ్ గ్రామంలో గోసేవకులైన జాదవ్ గంగాధర్‌పటేల్ దంపతులను గురువారం సన్మానించారు. మాటేగాం కొరడి గణపతి ఆలయం, జిల్లా గో సేవా విభాగం ఆధ్వర్యంలో శాలువా, పూలమాలతో సత్కరించారు. గ్రామంలో అధిక సంఖ్యలో పోషణ చేస్తున్నందుకు సన్మానించినట్లు వారు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు రామకృష్ణాగౌడ్, లక్ష్మణ్‌రావు, నాగమణి లింగన్న, నూకలసురేశ్, అశోక్, నారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

భైంసాటౌన్: గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో గురువారం వినతిపత్రం అందజేశారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు నియంత్రించాలని, పాఠశాలల్లో యూనిఫాం, టై, బెల్టు, షూస్, పాఠ్యపుస్తకాలు విక్రయించకుండా చూడాలని కోరారు.

కాలినడకే శరణ్యం..

- రోడ్డున్నా బస్సులు లేవు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు


బోరిగాం పాఠశాలకు కాలినడకన వెళ్తున్న బోల్సా,ఉమ్రి(కే) విద్యార్థులు

తానూరు: ప్రగతి చక్రాలు పల్లెల దరిచేరడం లేదు. రోడ్డు సౌకర్యాలు ఉన్నా ఆర్టీసీ అధికారులు కరుణించకపోవడంతో ప్రయాణికులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలకు రహదారులు ఉన్నా ఆదాయం రావడం లేదనే సాకుతో అధికారులు బస్సులు నడపడం లేదు. దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రభుత్వం పిల్లలకు చదువులు చదివించాలని ప్రచారం చేస్తున్న వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విద్యార్థుల పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు వాహనాలే దిక్కు

తానూరు మండలంలోని ఎల్వత్, తొండాల, ఉమ్రి(కే), బెంబర, బామ్ని, దాగాం, మసల్గా, కళ్యాణి, నంద్‌గాం, హిప్నెల్లితండా, బోంద్రట్, వాడవన గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులకు ప్రైవేటు వాహనాలే దిక్కయ్యాయి. అత్యవసర సమయంలో, నిత్యవసరానికైన గ్రామీణులు కాలినడకన 3 కి.మీ వెళ్లి అక్కడి నుంచి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. విద్యార్థులు పరిమితికి మించి వెళ్లడంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గత రెండేళ్ల క్రితం బోల్సా సమీపంలో రెండు ఆటోలు ఢీకొని 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. రెండేళ్ల కిందట బామ్ని గ్రామ సమీపంలో ఆటో గుంతలో పడి ఆరుగురు ప్రమాదాల బారిన పడ్డారు. దౌలతాబాద్ సమీపంలో ఆటో బోల్తాపడి ప్రయాణికుడు మృతిచెందాడు. హిప్నెల్లి సమీపంలో ఆటో బోల్తాపడి ఎల్వి గ్రామానికి చెందిన మారోతి మరణించాడు.

అమలు కాని హామీలు

ఏటా పాఠశాల ప్రారంభంలో ప్రభుత్వం ప్రభుత్వ బడికి పంపించాలని ప్రచారం చేస్తోంది. అన్ని సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు విద్యానందిస్తామని హామీలు ఇస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. విద్యార్థుల కోసం బస్సులు నడిపించడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామం నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ప్రతి విద్యార్థికి నెలకు రూ.వెయ్యి ఖర్చు చేస్తున్నారు. కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లలేక తల్లిదండ్రులతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. పాఠశాలకు ఎందుకు పంపడం లేదని ప్రశ్నిస్తే గ్రామానికి బస్సు సౌకర్యం లేదని చెబుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల, ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

కాలినడకన వెళ్తున్నాం



మా గ్రామానికి రోడ్డు ఉన్నా బస్సు రాదు. 2 కి.మీ దూరంగా కాలినడకన బోరిగాం పాఠశాలకు వెళ్తున్నాం. నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లిరావడంతో అలసిపోతున్నాం. గామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శృతి, విద్యార్థిని

పట్టించుకోవడం లేదు



మా గ్రామానికి బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి సమస్య పరిష్కరించాలి.

– నర్సింగ్, ఉమ్రి(కే) గ్రామస్తుడు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తానూరు: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలందించాలన్నారు. విషజ్వరాలు సంభవిస్తే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామస్తులకు క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలన్నారు. వర్షాలు కురిస్తే గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీవో మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో రమేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాలో వర్షపు నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ జానకి, ఎంపీవో నసీరుద్దీన్, కార్యదర్శి విక్రమ్‌రాజ్, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీవో అబ్దుల్ సమద్

కుంటాల: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎంఏ రహీం పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హరితహారంలో భాగంగా ప్రతి ఒక్కరితో మొక్కలు నాటించాలన్నారు. ఏపీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: రాజూర గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం గోదావరి మాట్లాడుతూ ఇంటి ఆవరణలో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సురేశ్‌రావు, కార్యదర్శి మహేశ్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ల తనిఖీ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, కేసుల వివరాలు వాటి పురోగతిపై ఎస్సై హన్మాండ్లును అడిగి తెలుసుకున్నారు. నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఎస్సై మాన్‌సింగ్, కానిస్టేబుళ్లు వెంకటేశ్, కృష్ణ, సంతోషి ఉన్నారు.

కుంటాల: శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేయాలని భైంసా రూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. గురువారం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి మాట్లాడారు. విత్తనాలు, ఎరువులు తరలిపోకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెంచాలన్నారు. జూలై 1 నుంచి అమలయ్యే కొత్త చట్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సై వి.రజినీకాంత్, ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ ఉన్నారు.


నర్సాపూర్(జి): పోలీసులతో మాట్లాడుతున్న నిర్మల్‌రూరల్ సీఐ శ్రీనివాస్

అసత్య ప్రచారంపై ఫిర్యాదు

నిర్మల్‌టౌన్: రాజాశ్యామల పీఠం నిర్మల్ వ్యవస్థాపకుడు శివరాజయోగి కృష్ణస్వామీజీపై అసత్య ప్రచారం చేసిన చానెళ్లు, సోషల్ మీడియాపై చర్యలు తీసుకోవాలని స్వామీజీ భక్తులు నిర్మల్ పోలీస్ టౌన్ స్టేషన్‌లో సీఐ ప్రవీణ్‌కుమార్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్టేషన్ ఎదుట హిందూ ధర్మ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. హిందూ ధర్మ ప్రతిష్టను, నిర్మల్ నగర ప్రతిష్టను కించపరిచేలా చేస్తున్న వారిని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో శివాజీ ఉత్సవ సమితి అధ్యక్షుడు మెడిసెమ్మె రాజు, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, మహాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్, పుట్ట సంధ్య, లలిత, మహేందర్, భక్తులు పాల్గొన్నారు.


సీఐకి వినతిపత్రం ఇ స్తున్న సభ్యులు

ఢిల్లీలో యూత్ కాంగ్రెస్ నిరసన



నిరసనలో సతీశ్‌రెడ్డి

కడెం: నీట్ పరీక్ష రద్దు చేయాలని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షు డు శివసేనారెడ్డితో కలిసి జిల్లా అధ్యక్షుడు పి.సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

తానూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శాముల్ పేర్కొన్నారు. మండలంలోని ఎల్వి గ్రామంలో గురువారం గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లక్కీ లాటరీ పేరిట ఎవరైన ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దన్నారు. బ్యాంక్ వివరాలు, ఇతరవి అడిగితే ఇవ్వొద్దన్నారు. అదే విధంగా వాహనదారులు వాహన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది శివరాం తదితరులు ఉన్నారు.


ఫౌంటెయిన్‌ను స్వల్పంగా తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

‘ట్రాఫిక్’ సమస్యలపై కదలిక

సాక్షి స్పందన

నిర్మల్: వాహనాలు వెళ్లేది ఇలాగేనా..!, ఇలా వెళ్తే ఎలా..! అంటూ జిల్లాకేంద్రంలోని జయశంకర్‌సార్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలపై 'సాక్షి' దినపత్రిక జిల్లా టాబ్లాయిడ్‌లో వరుసగా ప్రచురించిన కథనాలకు మున్సిపల్ యంత్రాంగం స్పందించింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు బారికేట్లు పెట్టడంతో వాహనదారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక్కడ నిర్మల్ కొయ్య బొమ్మల ఫౌంటెయిన్ ఎత్తుగా ఉండటంతో ఇబ్బందిగా ఉందని గుర్తించారు. ఈమేరకు గురువారం రాత్రి పొక్లెయినర్‌తో స్వల్పంగా ఎత్తును తగ్గించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కౌన్సిలర్లు పరిశీలించారు. మిగతాచోట్ల ట్రాఫిక్ సమస్యలను ఇలాగే పరిష్కరించాలని నిర్మల్‌వాసులు కోరుతున్నారు.

గుంతలు పూడ్చివేత

నర్సాపూర్(జి): మండల కేంద్రం నుంచి కుస్లీ గ్రామం వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుస్లీ ఆటో యూనియన్ సభ్యులు స్పందించి గురువారం గుంతలను పూడ్చివేశారు. మొరం పోసి బాగు చేసుకున్నారు. వర్షాకాలం గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కురుమే రవి, వడ్ల లక్ష్మణ్, శేఖర్, సుధీర్ పటేల్, సాయినాథ్ పటేల్ తదితరులు ఉన్నారు.


పూడ్చివేసిన ఆటో యూనియన్ సభ్యులు

వరినారులో జాగ్రత్తలు పాటించాలి

లోకేశ్వరం: రైతులకు వరినారులో తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో గణేశ్ అన్నారు. మండలంలోని ధర్మోర గ్రామంలో నారుమడిని గురువారం పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ నారు మడిలో చీడపీడలు ఆశిస్తే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. రైతులు ఉన్నారు.

గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

దిలావర్‌పూర్: మండల కేంద్రంతోపాటు గుండంపల్లి, సిర్గాపూర్ గ్రామాల్లో గురువారం ఢిల్లీకి చెందిన కేంద్ర పర్యాటక బృందం పర్యటించింది. గ్రామైఖ్య సంఘాల మహిళలు తమ ఆర్థిక పురోభివృద్ధికి చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో ప్రొఫెసర్ రేవతితోపాటు సభ్యులు గోవింద్ కెల్కర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల కుటుంబం, జీవన స్థితిగతులు, ఆర్థిక స్వావలంబనకు చేపడుతున్న కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. రైతు ఉత్పత్తి కంపెనీ ద్వారా సంఘాలు పొందుతున్న ఆదాయం గురించి మహిళలను అడిగారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చేపడుతున్న కార్యక్రమాలపట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఏపీఎం సులోచనరెడ్డి, సీసీలు పోశెట్టి, సాయన్న, ముత్యం, ఎఫ్‌పీసీ సీఈవో విశ్వనాథ్, మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, అకౌంటెంట్ మహేశ్ ఉన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి

ఖానాపూర్: మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో అటవీ హక్కు పత్రాలు గల వ్యవసాయ భూముల్లో త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. ఏపీకేఎస్ రాష్ట్ర కోశాధికారి నంది రామయ్య ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో సబ్ ఇంజినీర్ వెంకటేశ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు పొలాలను పరిశీలించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. పూసం లక్ష్మణ్, తోడసం మంతు, గోపాల్, రమేశ్, నాగోరావు తదితరులు ఉన్నారు.

పద్మశాలీలకు అండగా ఉంటా

భైంసాటౌన్: పద్మశాలి సంఘ సభ్యులకు, కులస్తులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కిసాన్‌గల్లిలో భక్త మార్కండేయ మందిర నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరుకు కృషి చేశారు. దీంతో గురువారం ఎస్ఎస్ కాటన్‌లోని ఆయన కార్యాలయంలో పట్టణ సంఘ సభ్యులు కలిసి ఘనంగా సన్మానించారు. గౌరవాధ్యక్షులు కాశీరాం, వెంకటేశ్, కృష్ణదాస్, తదితరులున్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సభ్యులు

వర్షం కోసం పూజలు

భైంసారూరల్: వర్షం కురువాలని కోరుతూ ఇలేగాం గ్రామంలో గురువారం పూజలు నిర్వహించారు. వర్షాలు కురియకపోవడంతో పొలాల్లో మొలకలు వాడిపోతుండడంతో రైతులు దేవున్ని నమ్ముకుని వరుణుని కరుణ కోసం పూజలు చేశారు. గంగాజలాలు తీసుకువచ్చి ఆలయాల్లో దేవతామూర్తులకు జలాభిషేకం చేశారు.

గంగాజలాలతో ఆలయాలకు వెళ్తున్న గ్రామస్తులు ➤


మొక్కలు పంపిణీ చేస్తాం

లోకేశ్వరం: గ్రామాల్లో త్వరలో నర్సరీ మొక్కలు పంపిణీ చేస్తామని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. మండలంలోని పోట్‌పల్లి గ్రామ నర్సరీలోని మొక్కలు, పంచాయతీ రికార్డులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురవడంతో నర్సరీ మొక్కలను నాటేందుకు పంపిణీ చేస్తామన్నారు. రైతులు పొలంగట్లపై నాటాలన్నారు. పంచాయతీల్లో రికార్డులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. రోడ్లు, మురుగుకాల్వలను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో సోలమాన్‌రాజ్

నూతన కార్యవర్గం ఎన్నిక

ముథోల్: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహ కమిటీ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జోహండలే ధమ్మపాల్, ఉపాధ్యక్షుడిగా వాగ్మారే చంద్రకాంత్, జనరల్ సెక్రటరీ చందనే గౌతమ్, జాయింట్ సెక్రటరీగా గంగాప్రసాద్, కోశాధికారిగా సొన్కంబ్లే రాహుల్, జాయింట్ సెక్రటరీగా సునీల్ ఎన్నికయ్యారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సోన్: స్థానిక రైతువేదికలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, శాఖల అధికారులు ఆయా నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ), ఒడ్డెపెల్లి గ్రామల మధ్యన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 150 లీటర్ల ఆయిల్‌ను బుధవారం గుర్తు తెలియని దొంగలు చోరీ చేసినట్లు రైతులు తెలిపారు. విద్యుత్ ఏఈ మహేశ్ సూచనలతో జూనియర్ లైన్‌మెన్ ఛత్రపతి గురువారం ఘటన స్థలానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు.

చెరువు కబ్జా కాకుండా చూడాలి

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు కబ్జాకు గురవుతుందని, వెంటనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని గంగపుత్ర సంఘ సభ్యులు కోరారు. తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు గురువారం వినతిపత్రం అందించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి చెరువు కబ్జా కాకుండా చూడాలని కోరారు. గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్‌లో రెండో షిర్డీగా ప్రసిద్ధి చెందిన సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం బాబాకు మంగళ స్నానం, అలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్న హారతిలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కళాశాల అభివృద్ధికి సహకారం అవసరం

కుంటాల: జూనియర్ కళాశాల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని గ్రామస్తులు పేర్కొన్నారు. కుంటాలలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ఏర్పాటుతో గురువారం వారు సమావేశమయ్యారు. జూలై మొదటి వారం నుంచి తరగతులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో నిర్వహణ కోసం దాతలు ముందుకు రావాలని కోరారు. అధ్యాపకులతోపాటు మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే రామారావుపటేల్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఎంపీపీ అప్క గజ్జారాం, ప్రిన్సిపాల్ తుకారాం, జీపీ రమణారావు, జుట్టు లక్ష్మణ్, దొనికెన వెంకటేశ్, పడకండి దత్తాద్రి, జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్, లెక్చరర్ భోజారాం పాల్గొన్నారు.